క్లుప్తంగా

ఏసీపీకి సన్మానం



నర్సంపేట : స్థానిక ఏసీపీ రవీందర్‌రెడ్డిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్టీట) కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్, సభ్యులు శనివారం సన్మానించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తొలుత ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా వైస్ చైర్మన్ భూక్య భద్రు నాయక్, జిల్లా జనరల్ సెక్రటరీ చెన్నూరి రవి, జిల్లా సెక్రటరీలు మద్దెల శ్యామ్‌కుమార్, గాదగోని భిక్షపతి, కొమ్ముక బాబు, జిల్లా యూత్ చైర్మన్ గోపగాని నాగరాజు, జిల్లా మహిళా సెక్రటరీ బండి విజయ, చెన్నారావుపేట మండల మహిళా చైర్మన్ ముంజ లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండు బాజ్జీ, కర్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. అలాగే రథోత్సవ, సుప్రభాత సేవతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.

హనుమత్ హోమం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమత్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత హనుమాన్ మాలధారులతోపాటు అర్చకుడు ఝుదుగురి రమేశ్ మూర్తి ఆధ్వర్యంలో హనుమత్ వ్రతం చేశారు. సాయంత్రం గ్రామంలో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాలధారులు పుట్టపాక రాజేందర్, కూకట్ల రాజు, భాస్కర్, గుండెబోయిన ఖాజీ, కొమ్మెర రాజు, చాడ మోహన్‌రెడ్డి, హంస రాజు, జటబోయిన రాజేందర్, అక్కెల్లి చరణ్‌స్వామి, ప్రవీణ్, గాదం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు హనుమాన్ మాలధారుల పాదయాత్ర



గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లికి చెందిన హనుమాన్ మాలధారులు శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు. అక్కడ మాలవిరమణ చేయనున్నారు. వెళ్లిన వారిలో మాలధారులు గోనె వినయ్ కుమార్‌రెడ్డి, శరత్‌తేజ, తదితరులున్నారు.

నివాళి



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన శ్రీను, రాగంపేటకు చెందిన కేవసిక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందగా వారి మృతదేహాలకు మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఐలయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత

రాయపర్తి : మండలంలోని రాయపర్తికి చెందిన మచ్చ శ్రీదేవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, నూనె, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు మాట్లాడారు. ఫౌండేషన్ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, గారె నర్సయ్య, రాంచందర్, ముద్రబోయిన సుధాకర్, చందు, గురునాథం, యాదగిరి, సింహాద్రి, మచ్చ శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం..!

పర్వతగిరి : మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అయినా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని రోళ్లకల్, నారాయణపురం, కల్లెడ, రావూరు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా భారీ స్థాయిలో కొనసాగుతోంది. ఆకేరు వాగు ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తవ్వి ఫిల్టర్ చేసి పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అక్రమార్కుల తీరుతో ఆకేరు వాగులో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్న దుస్థితి నెలకొంది. కొందరు రైతులు పట్టా భూమిలో ప్రభుత్వ అనుమతి లేకున్నా ఇసుకను ఇష్టారీతిన రవాణా చేస్తున్నారని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. మండలం నుంచి ప్రతిరోజూ సుమారు 20కిపైగా ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్టు సమాచారం. అక్రమార్కులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా కోసం ప్రత్యేకంగా 4, 5 జేసీబీలు ఏర్పాటు చేశారు. పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోకపోవడం, కేసులు పెట్టకపోవడంలో అంతర్యం ఏంటని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

అక్రమ రవాణాను అరికట్టాలి



మండలంలో ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి. అధికారులు విచారణ చేపట్టి ఇసుక రవాణాను అరికట్టాలి.

\- కొండ వెంకన్న, రైతు, పర్వతగిరి

చట్టరీత్యా నేరం



అనుమతి లేకుండా ఇసుక రవాణా చట్టరీత్యా నేరం. బాధ్యులపై చర్యలు తప్పవు. పట్టా భూముల్లో నుంచి ఇసుక తవ్వినా ప్రభుత్వ అనుమతి ఉండాలి. లేకుంటే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

\- వెంకటస్వామి, తహసీల్దార్

అర్హులకు 'స్థానిక' ఎన్నికల్లో అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ : అర్హులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో శనివారం నిర్వహించిన నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ సంస్థాగత సన్నాహక ఎన్నికల సమావేశానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని చెప్పారు. కార్యకర్తలందరికీ సమయానుకూలంగా సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం పీసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, మేడి రవిచంద్ర మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా ఉందని అభినందించారు. నియోజకవర్గాన్ని ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలిపిన ఘనత మాధవరెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ అధిష్ఠానం మాధవరెడ్డి సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని ఆశిస్తున్నామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్ల జగన్మోహన్ రెడ్డి, నెక్కొండ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు అశోక్, గోపాల్ నాయక్, హరిబాబు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు దామోదర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి మధుకర్

నర్సంపేట : ఎన్నికలకు ముందు గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ విమర్శించారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి మధుకర్ అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి రాగానే రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా రూ.2 లక్షల నగదు బదిలీ చేస్తామని, తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే నగదు బదిలీ చేయడంతోపాటు గొర్రెల కాపరుల సహకారం సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, జీవాలకు ఇన్సూరెన్స్ చేయించాలని, పశు సంవర్ధక శాఖకు మంత్రిని కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు తప్పవన్నారు. సమావేశంలో నాయకులు కుక్కల సతీశ్, జక్క రవి, కుక్కల రాజు, నాంచారి కుమారస్వామి, జె.రమేశ్, కావటి నర్సింహారావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

జిల్లాస్థాయి విజేతగా నర్సంపేట



గూడూరు : మండల కేంద్రంలో నూనావత్ ధన్‌రాజ్ స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలో నర్సంపేట జట్టు మొదటి స్థానంలో విజేతగా నిలిచింది. ములుగు జిల్లా గంగారం మండలం పునుగొండ్ల జట్టు ద్వితీయ విజేతగా, గూడూరు జట్టు తృతీయ విజేతగా నిలిచాయి. మొదటి విజేతకు షీల్డ్‌తోపాటు రూ.30 వేలు, ద్వితీయ విజేతకు రూ.20వేలు, తృతీయ విజేతకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు దుశ్యంత్ రెడ్డి, కంకటి ఉప్పలయ్య, యాకూబ్ పాషా, కోరె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



పర్వతగిరి : దర్భంగాలోని అంబేడ్కర్ హాస్టల్‌లో విద్యార్థులను కలవడానికి వెళ్లిన ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకి బీహార్ పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో శనివారం నిరసన తెలిపారు. ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, మండల అధ్యక్షుడు గొడుగు వినయ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్, నాయకులు రాజేశ్, వెంకన్న, శ్రావణ్, రంజిత్, దేవేందర్, రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ సామాజిక బాధ్యత



వర్ధన్నపేట : మాట్లాడుతున్న నర్సింహస్వామి



పర్వతగిరి : మాట్లాడుతున్న సుష్మ

● డీసీపీయూ కౌన్సిలర్ నర్సింహస్వామి

వర్ధన్నపేట : బాలల రక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయూ) కౌన్సిలర్ నర్సింహస్వామి ఆకాంక్షించారు. మండలంలోని కట్ర్యాలలో బాలరక్ష భవన్, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలల రక్షణ చట్టాలు, మహిళల హక్కులపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో నర్సింహస్వామి మాట్లాడారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సెంటర్, బాల కార్మిక చట్టం, మానవ అక్రమ రవాణా, తల్లిదండ్రుల నిరాదరణకు గురైన బాలలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్లు సుష్మ, మౌనిక మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, ప్రేమ వివాహాలు, తదితరాలపై వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల, బాలల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహిళల కోసం టోల్ ఫ్రీ నంబర్ 181 ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు పోలీసు, న్యాయ, వైద్య, తదితర సాయం అందుతాయని వివరించారు. సమావేశంలో వీఓఏ స్వప్న, సీసీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీయూ కౌన్సిలర్ నర్సింహస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్లు సుష్మ, మౌనిక మాట్లాడారు. చైల్డ్‌లైన్, ఇతర టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏ స్వప్న, సీసీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సాంబయ్య, నాయకులు

● బీఆర్‌పీ రాష్ట్ర కన్వీనర్ సాంబయ్య

నర్సంపేట : జూన్ 7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కన్వీనర్ జన్ను సాంబయ్య కోరారు. పట్టణంలో తనుగుల రామచంద్రు ఆధ్వర్యంలో ఆవిర్భావ సభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారంతోపాటు బహుజనులు రాజ్యాధికారం సాధించే దిశగా పార్టీ పని చేస్తుందని తెలిపారు. సభకు అన్ని వర్గాల ప్రజలూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ కోట కవిత, నాయకులు బుర్రి సాగర్, శ్రీకాంత్, కొర్ర గొర్‌సింగ్, పీసరి రజిత, శాహిదా, తనుగుల స్వప్న, అంజి, మాదాసి రాధ, సంపూర్ణ, వనమ్మ, స్రవంతి, భవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు

● అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో యూనిట్ ఏర్పాటుకు శనివారం స్థలాన్ని గుర్తించారు. అలాగే ఆత్మకూరు, తిరుమలగిరిలో వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.64లక్షలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాకు రెండు యూనిట్లు మంజూరుకాగా ఒకటి హసన్‌పర్తిలో మరొకటి ఆత్మకూరులో నిర్మించనున్నట్లు చెప్పారు. త్వరలోనే కలెక్టర్ ద్వారా నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆత్మకూరు యూనిట్‌కు ఆత్మకూరు, దామెర, పరకాల, శాయంపేట, నడికూడ మండలాలను సమీకృతం చేస్తామన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో 100 నుంచి 300 వరకు ఉపాధి కూలీలు పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతీరోజు రూ.300 నుంచి రూ.307 వచ్చే విధంగా కొలతలు ఇవ్వాలన్నారు. రూ.250 కంటే తక్కువ పని చేయొద్దని కూలీలకు చెప్పాలని అన్నారు. కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, డీటీసీ శ్రీధర్, ఈసీ రాము, టీఏ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, అనూష, ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది రాజేశ్వర్‌రావు, రాంబాబు, నరేశ్, కుమార్ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

యువకుడి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

నర్సంపేట రూరల్ : అప్పుల బాధతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేటలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన చుంచు నాగరాజు (43) ఇంటి నిర్మాణానికి అప్పు చేశాడు. సరైన ఆదాయం లేక అప్పు తీర్చలేని దుస్థితిలో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై చెప్పారు.

వృద్ధురాలి ఆత్మహత్య

సంగెం : అనారోగ్య సమస్యలు తాళలేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మొండ్రాయిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మొండ్రాయికి చెందిన ముస్కు రాధమ్మ (80)కు నలుగురు పిల్లలున్నారు. భర్త సుమారు 16 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటోంది. కాగా కొంత కాలంగా మోకాళ్ల, కీళ్ల నొప్పులతో రాధమ్మ బాధపడుతోంది. ఈ క్రమంలో విసిగిన రాధమ్మ శనివారం ఉదయం ఉరేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ప్రొబేషనరీ ఎస్సై అర్చన మీడియాకు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల శివారులోని ఆర్ఆర్ కాలనీకి చెందిన గీత కార్మికుడు నాగపురి శ్రీను శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి గీత కార్మికులు, కుటుంబీకులు శ్రీనును చికిత్స కోసం తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించాడు. శ్రీనును గౌడ సంఘం అధ్యక్షుడు అంజయ్య, నాయకులు ఎల్లాగౌడ్, నాగపురి సోమయ్య, యాకయ్య, నాగపురి అశోక్, మల్లేశ్, తదితరులు పరామర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వద్దు

● ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏఈ ఉదయశ్రీ

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయొద్దని లబ్ధిదారులను ఎంపీడీఓ శంకర్‌నాయక్, హౌజింగ్ ఏఈ ఉదయశ్రీ కోరారు. మండలంలోని జమలాపురంలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను శనివారం వారు పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. బిల్లులు పనుల మేరకు మంజూరవుతాయని తెలిపారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి కాని ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. పనులను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. నిర్మాణ దశకు అనుగుణంగా అధికారుల క్షేత్రస్థాయి విచారణ అనంతర నివేదిక మేరకు లబ్ధిదారులకు డబ్బులు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి దివ్య, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఈ

రేపటి నుంచి రాయితీపై జీలుగ విత్తనాలు

వర్ధన్నపేట : 2025–26 పంటల సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతులకు రేపటి (సోమవారం) నుంచి 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తామని ఏఓ విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్టె ఎరువులుగా ఉపయోగించే జీలుగ విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రేపు వర్ధన్నపేటలో, ఇల్లంద అగ్రోస్ సేవ కేంద్రంలో 30 కేజీల బ్యాగును రాయితీ పోగా రూ.2138 చెల్లించి కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రాయితీపై కొనుగోలు కోసం రైతులు పట్టా పాసు బుక్కుతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్‌ను ఏఈఓలకు అందించాలని సూచించారు. వర్ధన్నపేట, దమ్మన్నపేట, ల్యాబర్తి క్లస్టర్ల పరిధిలోని రైతులు వర్ధన్నపేటలోని అగ్రోస్ సెంటర్‌లో తీసుకోవాలని కోరారు. అలాగే ఇల్లంద, కట్ర్యాల, నల్లబెల్లి క్లస్టర్ల రైతులకు ఇల్లందలోని అగ్రోస్ సెంటర్‌లో అందిస్తామని తెలిపారు. రెండున్నర ఎకరాల వరకు వరి సాగు చేసే రైతులకు ఒకటి, అంతకు మించి సాగు చేసే రైతులకు రెండు బ్యాగులు ఇస్తామని వివరించారు.

రేగడి టిప్పర్లతో ఇక్కట్లు

మామునూరు : వరంగల్ భద్రకాళి ఆలయం నుంచి గవిచర్ల రోడ్డు మీదుగా నక్కలపల్లి ఇటుక బట్టీలకు తరలిస్తున్న రేగడి మట్టి టిప్పర్లు క్యూలైన్‌గా వస్తుండడంతో శనివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇసుక ట్రాక్టర్లు రోడ్డుపై పార్క్ చేసి ఉండటంతో రేగడి టిప్పర్లు బారులు తీరగా వాహన చోదకులు అవస్థ పడ్డారు. గవిచర్ల రోడ్డుపై ట్రాఫిక్ సమస్యల ఎదురుకాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన బానోతు రాజేందర్ సాకుతున్న పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. శనివారం రాత్రి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి తెగిపడిన విద్యుత్ వైర్‌కు తరలి అక్కడికక్కడే మృతి చెందింది.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

కొత్తగూడ : సీఎంఆర్ఎఫ్ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళీ కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు దక్కకుండా చేయడం అన్యాయమని తెలిపారు. సమావేశంలో తోటకూరి మధు, వాసం రవి, యాకయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సంఘం నిర్వాహకుడు..!

ఖిలా వరంగల్ : కరుణ పరపతి సంఘం నిర్వాహకుడు తొటం వెంకటయ్యను శనివారం మిల్స్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సుమారు 500 మంది సభ్యులకు చెందిన డబ్బు సంఘంలో నిల్వ ఉండగా ఇటీవల సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇళ్లు మంజూరు చేయండి

గూడూరు : మండలంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు గజ్జి లింగన్న కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్ రావుకు వినతిపత్రం అందజేశారు.

డాక్టరేట్ల ప్రదానం

కొత్తగూడ : ఏజెన్సీ ప్రాంతం నుంచి సాహిత్య రంగంలో ఒకరికి, సామాజిక సేవా రంగంలో సన్‌రైస్ యూనివర్సిటీ రాజస్థాన్ నుంచి మరొకరు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. కొత్తగూడ మండలం జంగవానిగూడెంకు చెందిన అమర్‌నాథ్, గోపాలపురం గ్రామానికి చెందిన వాసం వీరస్వామి సామాజిక సేవను డాక్టర్ చిన్నారావు వెల్‌ఫెయిర్ ఫౌండేషన్ వారు గుర్తించి ఢిల్లీలో సన్‌రైస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించారు.

పైపులైన్ పగిలి నీటి సరఫరాలో అంతరాయం



వర్ధన్నపేట : మండలంలోని చంద్రుతండాలో రైతు జేసీబీతో భూమి చదును చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. దీంతో వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల పరిధిలోని 111 ఆవాసాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ ఏఈ హరీశ్ సిబ్బందితో పైపులైన్ వద్దకు చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, ఆదివారం ఉదయం వరకల్లా నీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు.

'పింఛన్ ఇప్పించండి'



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన కొమ్ము రామచంద్రుకు నిలిచిపోయిన వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) విజయలక్ష్మిని కోరారు. ఈ మేరకు రామచంద్రును సత్యనారాయణ శనివారం కలెక్టరేట్‌కు తీసుకెళ్లి డీఆర్‌ఓకు వినతిపత్రం ఇప్పించారు. అనేక ఏళ్లుగా అందుతున్న పింఛన్ నిలిచిపోయిన విషయాన్ని సత్యనారాయణ డీఆర్‌ఓకు వివరించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పింఛన్ పునరుద్ధరించాలని కోరారు.

దగ్గు వెంకన్న సేవలు చిరస్మరణీయం



పరకాల : ఏబీవీపీ సీనియర్ నేత దగ్గు వెంకన్న సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. పరకాలలో నక్సలైట్ల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన దగ్గు వెంకన్న 34వ వర్ధంతిని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాడు ఏబీవీపీ పరకాల బాధ్యుడుగానే కాకుండా పోరాటాల గడ్డ పరకాలలో కాషాయం జెండాను రెప రెపలాడించేందుకు పాటుపడిన వెంకన్న పోరాటాన్ని నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవునూరి మేఘనాథ్, ఆర్‌పీ జయంత్‌లాల్, చందుపట్ల రాజేందర్‌రెడ్డి, పూర్ణచారి పాల్గొన్నారు.